‘సార్వత్రిక ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా తప్పకుండా ఎగురవేస్తాం. ఇటీవల తన నామినేషన్, ప్రచారం కార్యక్రమాలకు వచ్చిన స్పందనే ఇందుకు నిదర్శనం. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లిన సమయంలో వారు చూపించిన ఆదరణ మరిచిపోలేను. ఇది తమ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన మంచిని తెలియజేస్తుంది’ అని ఆ పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు.
– ఆరిలోవ

అభివృద్ధిలో తూర్పును నంబర్‌–1 చేస్తా

- సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి..
- వార్డు వాచ్ పేరిట నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా..
- వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

సాక్షి ఇంటర్వ్యూ



ఈసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం

ఈ ఎన్నికల్లో తూర్పులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం. తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ రోజురోజుకూ బలపడుతోంది. టీడీపీ, జనసేన కార్యకర్తలు సీఎం వైఎస్ జగన్ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. అందుకే నామినేషన్‌కు వేలా మంది ప్రజలు తరలివచ్చారు. నినాదాలు చేస్తూ పార్టీకి జేజేలు కొట్టారు. చాలా ఆనందంగా ఉంది.

కోడి పందాలే తప్ప అభివృద్ధి ధ్యాసే లేదు..

మూడు సార్లు టీడీపీ అభ్యర్థి గెలిచి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నియోజకవర్గంలో ఏ అభివృద్ధి చేపట్టలేదు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి అభివృద్ధిపై దృష్టి పెట్టలేదు. సంక్రాంతి సమయంలో కోడి పందాలు మాత్రం నిర్వహించి సొమ్ము చేసుకొన్నాడు. అందుకే ప్రజలు టీడీపీని అసహ్యించుకొంటున్నారు. 2019లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు మేలు చేశాయి. నియోజకవర్గంలో అర్హులందరూ లబ్ధి పొందారు. ఆ పథకాలే ఇప్పుడు ఇక్కడ నన్ను ఎమ్మెల్యేగా గెలిపించబోతున్నాయి.

ఓటమి భయంతోనే కలిశాయి..

టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయి. ఒంటరిగా పోటీ చేస్తే ఓడిపోతామనే భయంతో ఆ మూడు పార్టీలు కలిశాయి. దాని అర్థం మేం బలంగా ఉన్నమనే కదా. నియోజకవర్గంలో జనసేన, బీజేపీలకు అసలు ఆదరణ లేదు. టీడీపీని ప్రజలు నమ్మడం లేదు. అలాంటప్పుడు కూటమిగా వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయానికి ఢోకా లేదు. సంక్షేమ పథకాల ప్రభావం, ప్రజల ఆదరణ వైఎస్సార్‌సీపీకి పుష్కలంగా ఉన్నాయి.

కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు

నియోజకవర్గంలో కొన్ని కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రజలకు నివాసానికి చేరువలో వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఆరిలోవ నుంచి ఇసుకతోట, చినవాల్తేరు వరకు 8 యూపీహెచ్‌సీలు నిర్మాణం చేపట్టాం. ఒక్కోదానికి రూ.1.10 కోట్లు ఖర్చు చేశాం. వాటిలో చినవాల్తేరులో యూపీహెచ్‌సీ నిర్మాణంలో ఉంది. అన్ని వార్డుల్లో తారురోడ్లు, సీసీ రోడ్లు, కాలువలు, సామాజిక భవనాలు నిర్మించాం. కొన్నిచోట్ల విస్తరించి డబుల్ రోడ్లు నిర్మించాం. ఆరిలోవలో రూ.8 కోట్లతో ఆధునిక కల్యాణ మండపం నిర్మిస్తున్నాం. గెడ్డలపై రాకపోకలకు అనువుగా కల్వర్టులు, బ్రిడ్జిలు నిర్మించాం. ‘తూర్పు’ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం.

అందరి సహకారంతో గెలుపు బాట

నియోజకవర్గంలో టీడీపీని ఢీకొట్టి విజయం సాధించాలనే లక్ష్యంతోనే బరిలోకి దిగాను. దానికి తగినట్టు ప్రణాళిక రూపొందించాం. నియోజకవర్గంలో కార్పొరేటర్లు, కార్యకర్తలతో కలిసి టీడీపీ బలాన్ని తగ్గిస్తూ.. వైఎస్సార్‌సీపీ బలం పెంచుకొస్తున్నాం. కార్పొరేటర్లు, కార్యకర్తలు కష్టపడి సహకారం అందిస్తున్నారు. అన్ని వార్డుల్లో ఇంత వరకు 32 సిద్ధం సభలు నిర్వహించాం. సుమారు 100 రోజులు నుంచి గడపగడపకు మన ప్రభుత్వం, పాదయాత్రలు, సహ పంక్తి భోజనాలు నిర్వహించి అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యాం. ఆయా కార్యక్రమాలలో ప్రజలు హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతూ ఆదరిస్తున్నారు. అందుకే నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని గట్టిగా చెప్పగలుగుతున్నాం.

సేవలు నిత్యం కొనసాగుతాయి..

చేసిన సేవలను చెప్పుకోను. నేను రాజకీయాల్లోకి రాక ముందు నుంచే ఎంతో మంది విద్య, వైద్యం కోసం సహాయం చేశాను. అది అలవాటు. గుడులు, స్కూల్ బిల్డింగుల నిర్మాణాలకు విరాళాలు ఇస్తుంటాను. ఇప్పుడు రాజకీయాల్లో ఉన్నాను కాబట్టి ప్రతీది బయటకు వస్తుంది. ఇప్పుడు చేస్తున్న సేవా కార్యక్రమాలు కొత్తవేమీ కాదు. నిత్యం కొనసాగుతాయి.

గెలిపిస్తే ప్రజలకు సేవ చేసుకుంటా..



నేను గెలిచిన మొదటి రోజు నుంచి వార్డ్ వాచ్ చేస్తాను. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వార్డు పర్యటన ఉంటుంది. ఆ వార్డు కార్పొరేటర్‌తో కలిసి ప్రజా సమస్యలు తెలుసుకుంటాను. ఇందు కోసం నేను కారులో వెళ్లను. నా బైక్‌పై వచ్చి వార్డులో పర్యటిస్తాను. ప్రజలతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకుంటాను. సమస్యలపై ఆరా తీస్తాను. సంబంధిత సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తాను. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాను. వారికి సేవ చేయడమే ప్రధాన కర్తవ్యం. ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే గత ఐదేళ్లలో ఎక్కడ ఉన్నారో ప్రజలకు ముఖం కూడా చూపించలేదు. ఇంతవరకు ఎక్కడ ఉన్నారో తెలియని ఆయన ఎన్నికలు దగ్గరపడేసరికి ప్రజలు వద్దకు వచ్చి ముఖం చూపిస్తున్నారు. మళ్లీ ఓటేయండి అంటూ మాయ మాటలు చెబుతున్నారు. విశాఖ ఎంపీగా ఉంటూ తూర్పు ప్రజలకు ఐదేళ్లుగా అందుబాటులో ఉన్నాను. ఎంపీ నిధులతో పలుచోట్ల అభివృద్ధి పనులు చేపట్టాను. ఎమ్మెల్యేగా గెలిపిస్తే పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోను అభివృద్ధి చేస్తా.

జగనన్నతోనే అందరి సంక్షేమం



జాలరిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ముళ్లపూడి నాగజ్యోతి తదితరులు

- 19వ వార్డులో ఎంవీవీ కుటుంబ సభ్యుల విస్తృత ప్రచారం

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ సతీమణి ముళ్లపూడి నాగజ్యోతి, కుమారుడు శరత్ అన్నారు. వైఎస్సార్‌సీపీకి మద్దతుగా శుక్రవారం రాత్రి 19వ వార్డు లాసన్స్ బే కాలనీ, జాలరిపేటలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంవీవీని తూర్పు ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీని విశాఖ ఎంపీగా గెలిపించాలని కోరారు. ప్రతి ఇంటా వారికి మహిళలు పెద్ద ఎత్తున హారతులు పట్టి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన నవరత్నాలు ప్రజల జీవప్రమాణాలను మెరుగుపరిచాయన్నారు. రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లు ఇదే ఒరవడి కొనసాగాలంటే అది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. ఇటువంటి అంశాలను గ్రహించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవీవీ కుటుంబ సభ్యులతో పాటు 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు సూరాడ దాసు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థి ఖాన్ ప్రచారం



మసీద్ వద్ద ఖాన్ ప్రచారం

ఎంవీపీ కాలనీ: విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి ఎంజీఎం ఖాన్ శుక్రవారం తూర్పు నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని పలు విద్యా సంస్థలతో పాటు మసీదుల వద్ద స్థానికులను కలుసుకొని మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో వర్మతో పాటు పలువురు మద్దతుదారులు పాల్గొన్నారు.

19 నుంచి యోగా శిబిరం

ఏయూ క్యాంపస్: రుషిగాయత్రి యోగా కేంద్రం ఆధ్వర్యంలో లాసన్స్ బే కాలనీలో 14 రోజుల ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు కేంద్రం నిర్వాహకుడు ఆచార్య జి.అప్పలనాయుడు తెలిపారు. ఈ నెల 19 నుంచి ప్రారంభమయ్యే ఈ శిబిరం ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9440395439, 7780154103 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి



తారా మసీదులో ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

బీచ్ రోడ్డు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమం సాధ్యమవుతాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, విశాఖ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 22వ వార్డు పీఠాపురం కాలనీ, తారా మసీదు ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ పరిపాలన రాజధానికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ గెలిచిన తరువాత సీఎం జగన్ తన పాలనను విశాఖ నుంచే కొనసాగిస్తారన్నారు. సీఎం జగన్ నిర్ణయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. చంద్రబాబు ఏనాడూ ఉత్తరాంధ్రను పట్టించుకోలేదని వారు విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలని కోరారు. అనంతరం తారా మసీదులో వారు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీవీ నారాయణ, వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, షరీఫ్, పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంవీపీ గ్రంథాలయానికి ఫర్నిచర్ వితరణ

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ గ్రంథాలయానికి కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఫర్నిచర్ అందజేశారు. యూనియన్ 74వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా లైబ్రరీకి ఐరన్ బీరువాతో పాటు 15 ఫైబర్ కుర్చీలు పంపిణీ చేశారు. శుక్రవారం ఎంవీపీ కాలనీ సెక్టార్–7లోని లైబ్రరీలో యూనియన్ నాయకులు ఈ ఫర్నిచర్‌ను లైబ్రేరియన్ ఉమా మహేశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మహేంద్ర, శ్రీనివాసరావు, వైశాలి, తదితరులు పాల్గొన్నారు.

జర్ర అప్పారావుకు చందు పురస్కారం



ఆచార్య జర్ర అప్పారావు

సీతంపేట: ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్టు ప్రతి ఏటా ఇస్తున్న సాహిత్య సేవా పురస్కారం 2024 సంవత్సరానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావుకు అందజేయాలని నిర్ణయించినట్టు ట్రస్టు కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఒక ప్రటనలో పేర్కొన్నారు. తెలుగు సాహిత్యం, సంస్కృతికి పట్టుకొమ్మగా విలసిల్లుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ వికాసానికి జర్ర అప్పారావు చేసిన కృషి, నిబద్ధతకు గుర్తింపుగా ఈ నెల 18న విశాఖ పౌర గ్రంథాలయంలో ట్రస్టు నిర్వహించే సభలో అతిథుల చేతుల మీదుగా పురస్కారం ప్రదానం చేయనున్నట్టు తెలిపారు.

చిన్నారులను రక్షించిన బీచ్‌గార్డ్



చిన్నారులను రక్షించిన బీచ్‌గార్డు ధనరాజు

అల్లిపురం : మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధి గోకుల్ పార్క్ వద్ద శుక్రవారం సాయంత్రం రెల్లివీధికి చెందిన కె.సాగర్, వి.గణేష్ అనే ఇద్దరు చిన్నారులు స్నానానికి దిగారు. అయితే అలల తాకిడికి వారు సముద్రంలో కొట్టుకుపోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న బీచ్‌గార్డ్ ఎం.ధనరాజు గమనించి వారిని రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చాడు. పోలీసులకు సమాచారం అందించి వారు వచ్చాక చిన్నారులను అప్పగించారు. పిల్లలిద్దరికి ప్రాణాపాయం తప్పటంతో వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



20వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



చినవాల్తేరులో ఈవీఎంలో ఓటు వేయడంపై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డు చినవాల్తేరు, పెదవాల్తేరు ప్రాంతాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణను గెలిపించాలని కోరారు. పెదవాల్తేరులో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో మద్దిపోలి రెడ్డి, పండరీ బాయి, బి.రమాదేవి, బుజ్జి, కార్యకర్తలు పాల్గొన్నారు. చినవాల్తేరులోని పలు వీధుల్లో పార్టీ మండల అధ్యక్షుడు మువ్వల సురేష్ ప్రచారం చేశారు. ఓటర్ల వద్దకు వెళ్లి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని కోరారు.

20వ వార్డులో..

జీవీఎంసీ 20వ వార్డులో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



20వ వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి

15వ వార్డులో..

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు. ప్రధాన కూడలి వద్ద శుక్రవారం అధిక సంఖ్యలో కార్యకర్తలు పార్టీ జెండాలు చేత పట్టి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, అసెంబ్లీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణల గెలుపు కోసం ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలు అందజేశారు. ఈ ప్రచారంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరి బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



15వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మేయర్ ర్యాలీకి భారీ స్పందన

- తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన ఆరిలోవ



11వ వార్డులో ప్రచారం చేస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి, గొలగాని శ్రీనివాస్, కార్యకర్తలు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రచారంలో దూసుకుపోతోంది. వార్డుల్లో నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేస్తూ టీడీపీ నాయకులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. జీవీఎంసీ 11వ వార్డులో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. బాలాజీనగర్‌లో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ అంబేడ్కర్ కూడలి, అంబేడ్కర్ నగర్, టీఐసీ పాయింట్, ఎస్టీ కాలనీ, భరత్‌నగర్, ముస్తఫా కాలనీ, డ్రైవర్స్ కాలనీ, శ్రీహరినగర్, గాంధీనగర్, రవీంద్రనగర్, అన్నానగర్ మీదుగా సాగి తిరిగి బాలాజీనగర్ పార్టీ కార్యాలయం వరకు సాగింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గొలగాని శ్రీనివాస్, కార్యకర్తలతో కలిసి మేయర్ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, వాటిని మళ్లీ కొనసాగడానికి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరమని ఎంతైనా ఉందన్నారు.

బాలుడి ప్రాణం కాపాడిన కేజీహెచ్ వైద్యులు

- పూర్తిగా కోలుకుని డిశ్చార్జి అయిన బాలుడు



కోలుకున్న దిలీప్‌కుమార్‌ను అభినందిస్తున్న పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి



కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న బాలుడు దిలీప్‌కుమార్

మహారాణిపేట : తీవ్ర అనారోగ్యంతో కేజీహెచ్ పిల్లల వార్డులో చేరిన పది సంవత్సరాల బాలుడికి చక్కటి చికిత్స అందించిన వైద్యులు శుక్రవారం అతన్ని డిశ్చార్జి చేశారు. ఏప్రిల్ 10న విజయనగరానికి చెందిన దిలీప్ కుమార్ (10) తీవ్ర జ్వరం, కడుపు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి పలు సమస్యలతో నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. అనంతరం అతన్ని మరింత మెరుగైన ఆరోగ్యం కోసం అక్కడి నుంచి కేజీహెచ్ పిల్లల వార్డుకు తరలించారు. కేజీహెచ్ పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ బీవీ చక్రవర్తి ఆధ్వర్యంలో దిలీప్ కుమార్‌కు వైద్య సేవలు అందించారు. ఇటీవల కేజీహెచ్ పిల్లల వార్డులో ఆధునికీకరించిన పీఐసీయూలో బాలుడికి వైద్య సేవలందాయి. ఆధునికీకరణలో భాగంగా ఈ యూనిట్‌కు 6 వెంటిలేటర్లు, 3 హెచ్‌ఎఫ్‌ఎన్‌సీలు, 10 సెంట్రల్ ఎయిర్ కంప్రెషర్లు, 10 పడకలు ఏర్పాటు చేసిన సంగతి విదితమే. ఇటువంటి సౌకర్యాల వల్ల చక్కటి వైద్య సేవలంది బాలుడు బతికి బయట పడ్డాడు. ఈ బాలుడితో పాటు వార్డులో చందన శ్రీ,ఆకాంక్ష రాజు, నాయక్, పెంటమ్మ తదితర చిన్నారులు కోలుకుంటున్నారు. అనారోగ్యానికి గురైన పిల్లలకు చక్కటి వైద్య సేవలు అందించగలుగుతున్నామని, ఈ పరికరాల వల్ల ఆరోగ్యంగా చిన్నారులు ఇంటికి చేరుకుంటున్నారని పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి తెలిపారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లిస్తే.. పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు.

శరవేగంగా గెడ్డ ఆధునికీకరణ



లక్ష్మీనగర్‌లో జరుగుతున్న గెడ్డ పనులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో గెడ్డ ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కంబాలకొండల వెనక భాగం నుంచి ఆరిలోవ ఆపరేషన్ కాలనీ, దుర్గాబజార్, లక్ష్మీనగర్ మీదుగా శ్రీకాంత్‌నగర్ వరకు ఉండే గెడ్డ అడుగు భాగం, ఇరువైపులా గోడలు శిథిలమయ్యాయి. ఎక్కడికక్కడ పూడిక పేరుకుపోయి మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందిపడేవారు. ఆ పూడికను తరచూ తొలగించడానికి సైతం జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు నానా అవస్థలు పడేవారు. ఇప్పుడు ఆ సమస్యలకు చెక్ పెడుతూ అధికారులు ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఈ పనులు సుమారు రూ. 2.50 కోట్ల నిధులతో చేపడుతున్నారు. అడుగు భాగంలో సీసీ కాంక్రీట్, ఇరువైపులా గోడలు నిర్మిస్తున్నారు. వర్షం నీరు, స్థానికులు వాడుక నీరు ఎక్కడా నిలిచిపోకుండా నేరుగా కిందకు ప్రవహించే విధంగా నిర్మాణం చేపడుతున్నారు. వీలైన చోట్ల ఈ గెడ్డ అంచుల్లో పచ్చదనం ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులు పూర్తయితే ఆపరేషన్ కాలనీ, ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్, దుర్గాబజార్, లక్ష్మీనగర్ ప్రాంతాల ప్రజలకు దుర్వాసన సమస్య తీరనుంది.